క్లుప్తంగా

డిప్యూటీ ఎంపీడీఓగా చక్రపాణి



కాజులూరు: మండల డిప్యూటీ ఎంపీడీఓగా ఎం.చక్రపాణి బాధ్యతలు స్వీకరించారు. 2014 నుంచి 2019 వరకూ కాజులూరు గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేసిన చక్రపాణి ఆపై కరప మండలానికి బదిలీ అయి, అక్కడి నుంచి సామర్లకోట ఎంపీడీఓ శిక్షణా కేంద్రంలో పని చేశారు. ప్రస్తుతం పదోన్నతి పొంది కాజులూరు మండల డిప్యూటీ ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాజులూరులో సుదీర్ఘ కాలం పని చేయడంతో మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు, సిబ్బందితో మంచి పరిచయాలు, స్థానిక సమస్యలపైనా పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

తోటపేటలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట శివారు గాంధీపేట (ఎస్సీ కాలనీ)లో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీఏ డీటీఆర్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, నెల రోజుల క్రితం గ్రామస్తులు వచ్చి లోఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకు రావడంతో వారికి ట్రాన్స్‌ఫార్మర్ వేసి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ కె.రత్నాలరావు, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ మేడిశెట్టి వెంకటరమణలు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో అభినందనలు తెలిపారు.

ఎంపీపీ సాకా శ్రీనివాస్‌కు ఘన సత్కారం



మండపేటలో సాకా శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న గూటం సత్యనారాయణ

కపిలేశ్వరపురం: అద్దంకివారిలంక ఎంపీటీసీ సభ్యుడు సాకా శ్రీనివాస్ ఇటీవల ఎంపీపీగా నియమితులయ్యారు. ఆయన్ను వైఎస్సార్ సీపీ మండపేటలోని నియోజకవర్గ కార్యాలయంలో పలువురు నాయకులు ఆదివారం సత్కరించారు. కపిలేశ్వరపురం మండల పార్టీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రకాష్, నాయకులు ప్రగడ అర్జునరావు, చోడే నానిబాబు, బెల్లం సుధీర్, సన్నీ, పోలిశెట్టి గణేష్ తదితరులు సత్కరించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కొత్తపేట సత్యసాయి నిలయంలో మహిళలకు సత్కారం

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి స్ఫూర్తితో సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ బూసి జయలక్ష్మి అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సేవాతత్పరులైన మహిళలను గుర్తించి వారిని సత్కరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ డివిజనల్ అధికారి డాక్టర్ మెంటే సుమలత, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏఎస్ఎస్ రమాదేవి, భగవద్గీత పఠనంతో గణపతి సచ్చిదానంద స్వామి నుంచి బంగారు పతకం పొందిన వాసవి ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు శ్రీకాకోళ్లపు భార్గవి, కంచర్ల రాధాకుమారిలను సర్పంచ్, సత్యసాయి మహిళా విభాగం సభ్యులు ఘనంగా సత్కరించారు.

గాయపడిన బాధితుడి వైద్యానికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ పొయ్యి మీద నుంచి కూర మీద పడటంతో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (36) స్థానికంగా ఒక టిఫిన్ హోటల్‌లో వంట పని చేస్తారు. కొద్ది రోజులు క్రితం పొయ్యి మీద నుంచి కూర గిన్నె దింపుతుండగా జారి పడిపోవడంతో వేడి వేడి కూర మీద పడిపోయి చెయ్యి, కొంత శరీరం కాలిపోయాయి. పనికి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి, వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో ఇమ్రాన్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.

కార్తికం.. ఆధ్యాత్మిక శోభితం

- దీపాన్ని దైవ స్వరూపంగా భావిస్తూ పూజలు
- శివకేశవులకు ప్రీతిపాత్రమైన మాసం
- కార్తిక పూజలకు సిద్ధమవుతున్న ఆలయాలు



బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



వన సమారాధనలో భాగంగా ఆటపాటల్లో మహిళలు, చిన్నారులు (ఫైల్)

రాయవరం: కార్తిక మాసం శివ కేశవులిద్దరికీ ప్రీతికరమైంది. ఈ మాసంలో ప్రతి ఇంటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుంది. నిత్యం భక్తుల పూలతో ఆలయాలు కిటకిటలాడుతాయి. కార్తిక వనభోజనాల హడావిడి సరేసరి. ఈ మాసానికి అటు కార్తిక పురాణం, ఇటు శివ పురాణం ఎన్నో విశిష్టతలను చెబుతున్నాయి. కార్తిక మాసంలో ఒక్కో రోజుకు ఓ విశిష్టత ఉంది. శివుడిని తుమ్మిపూలతో, విష్ణువును అవిసె పూలతో పూజించడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చన్నది భక్తుల విశ్వాసం. ఈ మాసానికి అధిదేవుడైన దామోదరుణ్ని భక్తులు ముందుగా ప్రార్థిస్తారు. కార్తికలో గృహ నిర్మాణం ప్రారంభిస్తే ధన, ధాన్య లాభం కలుగుతుందని మత్స్య పురాణం చెబుతోందని అర్చకులు అన్నారు.

22 నుంచి కార్తిక సందడి

ఈ నెల 22 నుంచి కార్తిక సందడి ప్రారంభమవుతుంది. జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు, వైష్ణవ ఆలయాలతో పాటు గ్రామాల్లోని ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడనున్నాయి. ప్రముఖ శివాలయాలు, విష్ణాలయాలు కొలువైన ద్రాక్షారామం, సామర్లకోట, కోటిపల్లి, మురముళ్ల, పిఠాపురం, రాజమహేంద్రవరంలోని కోటిలింగాలరేవు, అన్నవరం, అంతర్వేది, ర్యాలి, వాడపల్లి తదితర ఆలయాలు కార్తిక సందడికి సిద్ధమవుతున్నాయి.

వన సమారాధనలకు ఏర్పాట్లు

జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలు వన సమారాధనలకు సిద్ధమవుతున్నాయి. కార్తిక మాసంలో వన సమారాధనలకు నిర్వహించడం ఆనవాయితీ. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన అంతర్వేది, ద్రాక్షారామ, కోటిపల్లి, రంపచోడవరం, మారేడుమిల్లి, పాములేరు, గోదావరి, సముద్ర తీర ప్రాంతాలను ప్రజలు సందర్శిస్తారు.

కార్తిక మాసం విశిష్టతలివే..

కార్తిక స్నానాలు ఆచరించడం వల్ల కాశాయ, వాచిక, మానసిక దోషాలు తొలగుతాయని పురాణాలు చెబుతున్నాయి. పుణ్యస్నానం ఆచరించిన వెంటనే దగ్గరలోని ఆలయాల్లో దీపారాధన, కార్తిక పురాణ పఠనం చేయాలి. కార్తిక మాసం తొలిరోజు కార్తిక శుద్ధ పాడ్యమికి బలి పాడ్యమి అని పేరు. ఈ రోజున బలి చక్రవర్తిని పూజించి దానం చేస్తే సంపదలు తరగవని చెబుతారు. మరుసటి రోజు 'భృగిని హస్త భోజనం' అని పేరు. దీన్నే యమ ద్వితీయ, భ్రాత ద్వితీయ అని కూడా అంటారు. ఈ రోజున మహిళలు సోదరులు, సోదర వరుసైన వారిని ఇంటికి పిలిచి స్వయంగా వంట చేసి భోజనం పెట్టడం వల్ల మహిళల ఐదవ తనం వృద్ధి చెంది కలకాలం ఉంటుందని శాస్త్రం చెబుతోంది. కార్తిక శుద్ధ చవితిని నాగుల చవితిగా చేసుకుంటారు. కార్తిక శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశికి ప్రబోధన ఏకాదశి, ఉత్థాన ఏకాదశి అని పేరు. ఉత్థాన ఏకాదశి మరుసటి రోజుకు క్షీరాబ్ధి ద్వాదశి అని పేరు. దీన్నే 'చిలికి ద్వాదశి' అని అంటారు. కార్తిక శుద్ధ చతుర్దశికి వైకుంఠ చతుర్దశి అని పేరు. ఈ రోజున మహా విష్ణువు పరమ శివుణ్ని పూజించారని నానుడి. కార్తిక పౌర్ణమిని త్రిపుర పౌర్ణమి అంటారు. పరమశివుడు త్రిపురాసులను సంహరించిన రోజుగా చెబుతారు. ఈ రోజున శివాలయాల్లో జ్వాలా తోరణోత్సవాన్ని నిర్వహిస్తారు. త్రిపురాసులను వధించిన పరమేశ్వరుడికి దృష్టి దోషం పోయేందుకు విజేయుడైన ఆయన గౌరవార్థం పార్వతీదేవి మొదటగా జ్వాలా తోరణోత్సవాన్ని జరిపించినట్లు చెబుతారు.

కార్తిక దీపం

కార్తిక మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ మాసంలో ఆలయాల్లో ఆకాశ దీపం వెలిగించడం ఆచారం. కార్తిక దీపాలను ఆలయాల్లో సూర్యోదయానికి ముందు, సాయం సంధ్య సమయాల్లో వెలిగించడం ఆనవాయితీ. ఇంటి ముంగిట, తులసి చెట్టు వద్ద దీపాలను వెలిగిస్తారు. దీపదానం చేయడం ఫలదాయకంగా చెబుతారు.

శివకేశవులను పూజించే మాసం



శివకేశవులకు బేధం లేనిది కార్తిక మాసం. ఏకకాలంలో శివకేశవులను పూజిస్తారు. ఆధ్యాత్మికత ఈ మాసంలో అధికంగా పరిఢవిల్లుతుంది. భక్తులతో కార్తిక మాసమంతా శివాలయాలు, విష్ణాలయాలు కిటకిటలాడతాయి.

– విలపర్తి ఫణిధర్‌శర్మ, శైవాగమ పండితులు, రాయవరం

ఉపవాసం

ఆధ్యాత్మిక సాధనకు కార్తిక ఎంతో అనువైన కాలం. అందుకే కార్తిక మాసంలో ఉపవాసం ప్రధాన నియమంగా పేర్కొంటారు. ఈ నెలలో ఉపవాసం ఆచరించి రాత్రివేళ మాత్రమే భోజనం చేయడం మంచిది. నెల మొత్తం ఉపవాసం చేయలేని వారు సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో ఉపవాసం ఆచరిస్తారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు మండపేటలో దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట పృథ్వీరాజ్ పుట్టినరోజు సందర్భంగా మండపేటలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని మండపేట, పట్టణం, రూరల్ గ్రామాలు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు మండపేటలో ఎమ్మెల్సీ తోట చేతుల మీదుగా కేక్ కట్ చేసి పృథ్వీరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంచారు. రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, పుట్టపూడి అబ్బు, పిల్లా వీరబాబు, అబ్బిరెడ్డి వీర్రాజు, సయ్యద్ రబ్బానీ, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో డాక్టర్ ఆరేటి యశోదానందకుమార్ స్మారకార్థం వివిధ పాఠశాలల విద్యార్థులకు స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన చెస్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొత్తం 145 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు రిటైర్డ్ వ్యవసాయశాఖ జేడీ కామిశెట్టి వేణుగోపాలరావు తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, కాన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నారు. హెచ్ఎం టీవీఎస్ఎస్వీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చురుగ్గా కోటి సంతకాల సేకరణ



కూళ్లలో సంతకాలు సేకరిస్తున్న పార్టీ శ్రేణులు



అముజూరులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

కె.గంగవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నేతృత్వంలో కోట సంతకాల సేకరణ చురుగ్గా సాగుతోంది. మండలంలోని కూళ్ల, అముజూరు, దంగేరు, యర్రపోతవరం, భట్లపాలిక, పాణింగపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ప్రజలు, విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించారు. పామర్రులో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చిట్టూరి చిన్ని, నానాపరపు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని మొదలుపెట్టారన్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదలకు మంచి వైద్యం అందించడానికి ప్రయత్నం చేయకుండా ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిల్లే నాగేశ్వరరావు, నానాపరపు కల్యాణి, పార్టీ నాయకులు పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం

- కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలి
- ప్రజల సంతకాలతో గవర్నర్‌ను కలుస్తాం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ తోట, వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రంగంలో ప్రారంభించిన వైద్య కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలో ఆదివారం ప్రభుత్వ రంగంలో ప్రారంభించిన రాష్ట్రంలోని 17 వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్సీ తోట ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై పట్టణంలో ర్యాలీ, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహించారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు, బస్టాండ్, మహనీయుల విగ్రహాల సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కలువపువ్వు సెంటర్ వద్ద ప్రజల సంతకాలను సేకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ సిరిపురపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు కూటమి ప్రభుత్వ దుర్మార్గ నిర్ణయాన్ని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసే దిశగా పాలన సాగించారన్నారు. కూటమి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు ఉత్సుకతను చూపిస్తోందన్నారు. కూటమి నేతలు తమ స్వప్రయోజనాల కోసం ప్రైవేటు జపం చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యనందించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోట్లు వెచ్చించి రాష్ట్రంలో 17 ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను ప్రారంభించారన్నారు. వాటిలో కొన్ని కళాశాలను పూర్తి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటిని పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయాలని కూటమి నాయకులు చూస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలను కాపాడుకునేందుకు చేస్తున్న ఉద్యమంలో సేకరించిన సంతకాలతో రాష్ట్ర గవర్నర్‌ను కలిసి సమస్యను వివరిస్తామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీలు సాకా శ్రీనివాస్, నాడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల కమిటీల అధ్యక్షులు గూటం సత్యనారాయణ, అడబాల బాబ్జి, వెలగల సత్యనారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, నాయకులు ముమ్మిడివరపు బాపిరాజు, పసుమర్తి నాగేశ్వరరావు, గారపాటి అశోక్, మేడిశెట్టి సత్యవేణి, పలివెల మధు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో అమ్మ పాత్ర సజీవం



మండపేటలో అమ్మపాటను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

మండపేట: సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్న ఆధ్వర్యంలో పట్టణంలోని ఆలమూరు తాలూక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నిర్వహించిన 'అమ్మకు స్వర నీరాజనం' కార్యక్రమం విశేషంగా ఆలోచింపజేసింది. డాక్టర్ చల్లా రవికుమార్ మాతృమూర్తి లక్ష్మి సంస్మరణలో భాగంగా అమ్మ పాటల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన ఆంధ్ర ప్రజానాట్య మండలి కళాకారులు అమ్మ గొప్పతనాన్ని తెలుపుతూ గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, నిర్వాహకులు మాట్లాడుతూ సమాజ గమనంలో అమ్మ పాత్ర అమోఘమైనదన్నారు. ప్రజానాట్య మండలి కళాకారులు జగన్, పి.సురేష్, మంగరాజు, ఐవీ, డి.సత్యనారాయణ, ఆర్ వీర్రాజు, ప్రసాద్, ప్రేమానందం, లక్ష్మణ్, రాంబాబు ఆలపించిన అమ్మ పాటలు విశేషంగా ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు జి.స్వామిప్రసాద్, ఎం.గౌరవ్, పి.లెనిన్‌బాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంట కాలువలో శవమై తేలిన మహిళ

పి.గన్నవరం: పుట్టింటి నుంచి అత్తారింటికి వస్తూ అదృశ్యమైన 34 ఏళ్ల వివాహిత పంట కాలువలో శవమై తేలిన ఘటనపై పి.గన్నవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతవరం శివారు మాతావారిపేటకు చెందిన కోట లక్ష్మణరావుకు, కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామానికి చెందిన పల్లవితో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్న క్రమంలో ఆమె సోదరుడు, తల్లి ఇక్కడికి వచ్చి సమస్యలను పరిష్కరించేవారు. ఈక్రమంలో ఈనెల 10న పోతవరం గ్రామానికి వచ్చిన తల్లిని, కుమార్తె పల్లవి బిళ్లకుర్రు గ్రామానికి తీసుకువెళ్లింది. అక్కడి నుంచి పోతవరం అత్తారింటికి వెళ్తున్నట్టు చెప్పి బయల్దేరింది. కానీ ఇక్కడికి రాలేదు. దీంతో ఆమె కోసం పరిసర ప్రాంతాలు గాలించినా, ఆచూకీ తెలియక పోవడంతో ఆమె సోదరుడు బొంతు తుక్కియ్య ఆదివారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈలోగా అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామం వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని తెలియడంతో అతడు అక్కడికి వెళ్లి, పల్లవి మృతదేహంగా గుర్తించాడు. అతడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

దీపావళికి సర్వం సిద్ధం

- మండలంలో 12 తాత్కాలిక బాణసంచా షాపులు
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు



పామర్రులో ఏర్పాటు చేసిన తాత్కాలిక షాపుల వద్ద బాణసంచా విక్రయాలు



గొల్లపాలెంలో బాణసంచా దుకాణాలు



ద్రాక్షారామలో బాణసంచా కొనుగోలుకు తరలివచ్చిన ప్రజలు

కె.గంగవరం: దీపావళి వచ్చిందంటే పిల్లలు, పెద్దలు ఎంతో ఆనందగా గడుపుతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకుంటాం. పురాణాల్లో నరకాసురుని వధ జరిగిన సందర్భంగా దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకుంటారు. ఇది దేశవ్యాప్తంగా నేడు జరుపుకోవడానికి పిల్లలు, పెద్దలు, మహిళలు సిద్ధంగా ఉన్నారు. బాణసంచా విక్రయాలు చేయడానికి మండల వ్యాప్తంగా 12 షాపులు ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వడంతో నిర్వాహకులు కూడా షాపులు ఏర్పాటు చేశారు. పామర్రు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 6, కె.గంగవరం- కోటిపల్లి రహదారిలో 4, మసకపల్లి, భట్లపాలికలో ఒక్కొక్కటి బాణసంచా విక్రయానికి అధికారులు అనుమతులిచ్చారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పర్యవేక్షణ చేసి తాత్కాలిక అమ్మకాలకు లైసెన్సులు మంజూరు చేశారు.

పండగ ప్రమోదం కావాలి

కాజులూరు: గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని పట్టణ, మండల గ్రామాల్లో అధికారులు పర్యటిస్తూ దుకాణాల ఏర్పాట్లపై పరిశీలనలు చేస్తూ వ్యాపారులకు తగు సూచనలు చేస్తున్నారు. ప్రతి ఏటా దీపావళికి ఒకటి, రెండు రోజుల ముందు నుంచి రామచంద్రపురం పట్టణంతోపాటు ద్రాక్షారామ, కె.గంగవరం, కాజులూరు, గొల్లపాలెం తదితర గ్రామాల్లో బాణసంచా విక్రయాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా రామచంద్రపురం రైతు బజారు ప్రాంగణం, ద్రాక్షారామ నున్న వారి కాంప్లెక్స్ వెనుక మైదానంలో, వెల్ల, హసన్‌బాద్ గ్రామాల్లో, కె.గంగవరం మండలంలో పామర్రు, గంగవరం, మసకపల్లి గ్రామాల్లో, కాజులూరు మండలంలో గొల్లపాలెం, కాజులూరు, దుగ్గుదుర్రు, జగన్నాథగిరి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోనూ అధిక సంఖ్యలో బాణసంచా దుకాణాల ఏర్పాటు చేశారు.

దీపావళి సందడి

రామచంద్రపురం రూరల్: దీపావళి కొనుగోళ్లతో నియోజకవర్గంలో సందడి నెలకొంది. రామచంద్రపురం పట్టణంతో పాటు రామచంద్రపురం రూరల్, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో ప్రజలు సోమవారం దీపావళి పురస్కరించుకొని ఆదివారం బాణసంచా దుకాణాలకు పోటెత్తారు. చిన్నారుల కోసం చిచ్చుబుడ్లు, మతాబులు, పెద్దలకు టపాసులు కొనుగోలు చేశారు. మహిళలు దీపాల కోసం ప్రమిదలు, కొవ్వొత్తులు కొనుగోలు చేశారు. పండగ పురస్కరించుకొని పూలు, పండ్ల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి.

నిబంధనలు తప్పనిసరి



అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. తాత్కాలిక షాపుల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి అమ్మకాలు జరుపుకోవాలి. ప్రతి షాపుల వద్ద నీటి డ్రమ్ములతో పాటు ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలి. షాపులలో పని చేసే ప్రతి ఒక్కరికీ బీమా ఉండాలి. షాపుల వద్ద భద్రత, బాధ్యత షాపుల యజమానులే చూసుకోవాలి. ప్రజలు కూడా దీపావళిని సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి. యువత రోడ్లపై ప్రజలు ఇబ్బంది పడేలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవరించి బాణసంచా కాలిస్తే చర్యలు తీసుకుంటాం.

–జానీ భాషా, ఎస్సై, కె.గంగవరం.

మాంసం విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో మాంసం విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని వినియోగదారులకు విక్రయించాలని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. స్థానికంగా విక్రయిస్తున్న మాంసం విక్రయ షాపులను ఆదివారం తనిఖీ చేశారు. మాంసం విక్రయదారులకు తగు సూచనలు చేశారు. మాంసంపై ఈగలు, దోమలు, విషపురుగులు వాలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన మాంసంను విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాత హరికట శ్రీవేద్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన హరికట శ్రీవేద్ ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.